


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 19-4-2025

సంపుటి: 21 సంచిక: 22
పేజీలు: 8 వెల: రూ.1



- సానా షన్ముఖరావు వైపు రాష్ట్ర అధ్యక్షుడు మొగ్గు
- హరిగోపాల్‌కు ఇవ్వాలని నగర నాయకులు పట్టు
- అమీతుమీ తేల్చడానికి 20న సిద్ధం
- శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా సమావేశమైన ప్రముఖులు
- వలస నాయకులకు బెర్త్ లేదని తేల్చేసిన సమావేశం





# కోమట్లు... ఎన్నికల కుంపట్లు

**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అందులోనూ పూర్తిగా నామినేటెడ్ పదవులు భర్తీ కాకపోవడంతో కులసంఘాలకు ప్రాతినిధ్యం వహించేవారికి పార్టీ ప్రాధాన్యత ఇస్తుందన్న ఆలోచనతో ఆ పదవులకు పోటీ పెరిగింది. 2024 ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన తెలుగుతమ్ముళ్లతో పాటు, ఎన్నికలకు ముందు వైకాపాను వీడి టీడీపీలోకి వచ్చినవారు, పరోక్షంగా కూటమి అభ్యర్థి గెలుపునకు సహకరించినవారు.. ఇలా వరుసగా పదవుల కోసం క్యూ కడుతున్నారు. జిల్లాలో కళింగకోమట్ల జనాభా మైనార్టీ సామాజికవర్గాలన్నిటికంటే ఎక్కువగా ఉండటం వల్ల ఈ కులసంఘం అధ్యక్ష పదవికి ఎన్నడూ లేనివిధంగా తీవ్ర పోటీ నెలకొంది. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పుడు ఉన్న మంత్రుల అభీష్టం మేరకు రాష్ట్ర, జిల్లా, జాతీయ అధ్యక్షులు, నగర అధ్యక్షులు, కార్యవర్గం ఏర్పాటయ్యేది. కానీ తొలిసారిగా జిల్లా కళింగకోమటి అధ్యక్ష పదవి కోసం నువ్వా, నేనా అన్న రీతిలో యుద్ధం జరుగుతోంది.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర కళింగకోమటి సంఘం అధ్యక్షుడిగా కోటబొమ్మాళికి చెందిన బోయిన గోవిందరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కులంలో జరిగిన కొన్ని కుమ్ములాటల నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బోయిన ప్రకటించారు. కానీ కళింగకోమటి పెద్దలంతా ఆయన్ను ఒప్పించి, మెప్పించి మళ్లీ ఆయనే కొనసాగేలా వ్యవహరించారు. ఇందుకు కారణం.. రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడి అండదండలు బోయిన గోవిందరాజులుకు ఉండటమే. అయితే ఇప్పుడు అదే బోయిన గోవిందరాజులు జిల్లా అధ్యక్షుడ్ని ఆయన అభీష్టం మేరకు నియమించే విధానం మాత్రం జిల్లాలో చాలామంది కళింగకోమటి నేతలు సరి కాదంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15 నుంచి ఈ సంఘంలో కోల్డ్‌వార్ జరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లా కళింగకోమటి సంఘం అధ్యక్షుడిగా ఉన్న తంగుడు జోగారావు వైకాపా ఫాలోవర్. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారింది. దీనికితోడు ఆయన పదవీ కాలం కూడా ముగిసింది. దీంతో కూటమికి చెందిన తెలుగుదేశం నేతను జిల్లా అధ్యక్షుడి కుర్చీలో కూర్చోబెట్టాలి. ఇందుకోసం ఏకాభిప్రాయం సాధించాలని బోయిన గోవిందరాజులు ఈ నెల 15న నగరంలో ఉన్న 15 మంది కళింగ కోమటి నేతలతో పాటు జిల్లాలో వారి సామాజిక వర్గం బలంగా ఉన్న మిగిలిన ప్రాంతాల నుంచి కూడా మరికొంతమందిని కోటబొమ్మాళి పిలిచారు. ఇందులో అభిప్రాయాలు సేకరించిన తర్వాత సోంపేటకు చెందిన సానా షన్ముఖరావును జిల్లా అధ్యక్షుడిగా నియమించాలన్న తన అభిలాషను బోయిన గోవిందరాజులు బయటపెట్టారు. నగరం నుంచి 15 మందికి పిలుపొస్తే.. ఆరుగురు మాత్రమే వెళ్లారు. దీంతో బోయిన గోవిందరాజులు సానా షన్ముఖరావు పేరును ప్రతిపాదిస్తే, ఎన్నికలకు ముందు టీడీపీలోకి వచ్చినవారికి ఎలా ఇస్తారన్న అభ్యంతరం లేవనెత్తడంతో పలాసకు చెందిన మల్లా కృష్ణారావు పేరు తెర మీదకు వచ్చింది. అయితే రాష్ట్ర అధ్యక్షుడు కోటబొమ్మాళిలో ఉండి, జిల్లా అధ్యక్షుడు సోంపేటలోనో, పలాసలోనో ఉంటే జిల్లా అధికారులు కేంద్రీకృతమైవున్న నగరంలో కళింగ కోమట్లకు దూరాభారం అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం కావడంతో మల్లా కృష్ణారావు బోయిన గోవిందరాజులు ఎలా చెప్తే అలా ముందుకెళ్లడానికి సిద్ధమంటూ ప్రకటించారు. శ్రీకాకుళం నగరానికే జిల్లా అధ్యక్ష పదవి ఉండాలన్న ప్రతిపాదన రావడంతో కోరాడ హరిగోపాల్ పేరు తెర మీదకు వచ్చింది. అయితే సానా షన్ముఖరావుకు ఇవ్వాలన్న బలమైన అభిప్రాయంతో బోయిన గోవిందరాజులు ఉండటం వల్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరాడ హరిగోపాల్‌ను పంపిస్తే బాగుంటుందన్న నరసన్నపేట టౌన్ ప్రెసిడెంట్ ప్రతిపాదనను గోవిందరాజులు తిరస్కరించారు. దీంతో సానా షన్ముఖరావు అధ్యక్షుడిగా ఉండాలా, మల్లా కృష్ణారావుకు ఇస్తారా, లేదూ తనకే ఇస్తారా? తేల్చుకోవాల్సింది ఇక్కడ కాదని, నగరంలో కళింగవైశ్య కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించి ఈ నెల 20న తన అభిప్రాయం చెబుతానంటూ తనతో వచ్చిన అంధవరపు సంతోష్, చైతన్య ప్రభుతో పాటు మిగిలిన తన మనుషులతో హరిగోపాల్ వెనక్కు వచ్చేశారు. ఈమేరకు శుక్రవారం రాత్రి స్థానిక కళింగవైశ్య కల్యాణ

- మిగతా చివరి పేజీలో



## 'రన్ ఫర్ జీసస్' సందర్భంగా ర్యాలీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రన్ ఫర్ జీసస్ సందర్భంగా శ్రీకాకుళం పట్టణ మండల పాస్టర్స్ ఫెలోషిప్, జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం, సీనియర్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ కమిటీల ఆధ్వర్యంలో క్రిష్టియన్ వర్షిప్ సెంటర్ వద్ద ర్యాలీ ప్రారంభించి సెవెన్‌రోడ్ జంక్షన్, చిన్నబజార్‌లో గల తెలుగు బాప్టిస్ట్ దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 1000మంది క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కె. విశ్వాసరావు, ఎ.శామ్యూల్ మోజెస్, కె.సుజ్ఞానరావు, దయానంద్, గోడి. జోసఫ్ డానియెల్, జీవన్, ప్రేమ్ కుమార్, జాన్‌బాబు, దానియెల్, శారా, నవీన్‌కుమార్, రాజేశ్వరరావు, యేసుదాస్, గురుమూర్తి, జాన్ నెహెమ్యా తదితరులున్నారు.




## ఎమ్మెల్యేను కలిసిన చిరు వ్యాపారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి మిల్లు జంక్షన్ కూడలిలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌కి అనుకుని ఉన్న దుకాణాలను రథసప్తమి వేడుకల్లో భాగంగా తొలగించిన విషయం తెలిసిందే. అయితే వ్యాపారులంతా తమ బతుకుతెరువు పోయిందంటూ వాపోయారు. 25,30 సంవత్సరాలుగా ఈ దుకాణాలను నమ్ముకునే జీవనం సాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని వారంతా ఎమ్మెల్యే వద్ద తమ గోడును చెప్పుకున్నారు. ఈ నేపధ్యంలో ఇటీవల ఎమ్మెల్యే శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో వ్యాపారులంతా కలిశారు. తమ సమస్యలను విన్నవించగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఆ స్థలంలో దుకాణాలను నిర్మించి, ఇప్పుడున్న వారికి ఆ స్థలాల్లో షాప్‌లను ఇస్తామని, ఆ ప్రక్రియ ఆలస్యమైతే తానే స్వయంగా అక్కడ ఉండి వ్యాపారుల బడ్డీలను అక్కడ పెట్టించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇవ్వడంతో వ్యాపారులంతా హర్షం వ్యక్తం చేశారు. అలాగే పొట్టి శ్రీరాములు మార్కెట్ విషయంలో కూడా వ్యాపారులతో ఆయన భేటీ అయి సరైన రీతిలో భరోసా కల్పిస్తూ, నేరుగా తనతోనే మాట్లాడి ఏ సమస్యలున్నా పట్టించుకోవాలని తనదైన శైలిలో వ్యాపారులకు దిశానిర్దేశం చేయడంతో వ్యాపారులు ఎమ్మెల్యే శంకరన్న మనవాడని, భోళా శంకరుడని చెప్పుకుంటూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.





రాష్ట్ర ప్రభుత్వం అదేశాలు మేరకు దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దేవస్థానం సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసి వైధిక సిబ్బంది, పాల సేవ కార్యకర్తలు ఆలయ ప్రాంగణంలో ఆలయ పరిస ప్రాంతాలలో స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమము నిర్వహించారు. కార్యక్రమములో ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు

– సత్యంన్యూస్, శ్రీకాకుళం




స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సునీల్‌కుమార్ పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేయించారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, పంచాయతీ సెక్రెటరీ సద్గుణరావు సూపర్వైజర్ రిషికేశ్వరరావు సుదర్శన్, సిహెచ్ఓ అధిమ్మ, సూపర్వైజర్ ఈశ్వరమ్మ స్టాఫ్ నర్స్ విమలాదేవి, హేమలత, రాజేశ్వరి, చిన్నారావ్ తదితరులు పాల్గొన్నారు

– సత్యంన్యూస్, పలాస

## స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)

స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. ప్రతినెల మూడవ శనివారం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం చేపట్టిన పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ నగరాలు, స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఉపాధి హామీ వేతనదారులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ర్యాలీగా వెళ్లి ప్రమాణం చేశారు. అదే విధంగా పాడైన కంప్యూటర్లు,టీవీలు, రేడియో, మొబైల్‌ఫోన్‌లు, వాషింగ్ మిషన్లు, మైక్రో ఓవెన్లు,సిడి ప్లేయర్లు, ఫ్యాన్లు తదితర వస్తువులను రీసైక్లింగ్ చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీవో, వైద్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.




## బిజెపి నాయకులది పిరికిపందల చర్య

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కేంద్రంలో బిజెపి ప్రభుత్వం దేశంలో మతవిద్వేషాలకు రెచ్చగొట్టే విధంగా దేశంలో విభజన పాలన చేస్తుందని దేశంలో మతాల మధ్య ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని డీసీసీ అధ్యక్షులు అంబటి క్రిష్ణారావు విమర్శించారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ ఎదురిస్తున్న కాంగ్రెస్ నాయకులను మట్టు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఆస్తుల మీద పార్టీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేయడం చాలా విడ్డూరం ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ పార్టీ గాని కాంగ్రెస్ పార్టీలోని వ్యక్తులు గాని భయ పడేది లేదని దేశంలోనూ రాష్ట్రంలోనూ బిజెపి చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి వెళ్లి కచ్చితంగా తెలియజేస్తామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## లచ్చన్న సేవలు మరువలేనివి

(సత్యంన్యూస్, పలాస)

స్వాతంత్ర్యం సాధించేందుకు స్వర్గీయ సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు మరువలేనివని మండల టీడీపీ అధ్యక్షులు భావన దుర్యోధన పేర్కొన్నారు. లచ్చన్న 19వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గం మందస మండలం మందస టౌన్, బాలిగాం హరిపురం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎందరో మహానుభావులు, ఎన్నో త్యాగాలకు వెన్ను చూపని విప్లవ యోధులన్నారు. ఎన్నెన్నో పోరాటాలకు ఎద శౌర్యమే ఆయుధంగా ముందుకు సాగిన మృత్యుంజయులన్నారు. దేశ సౌభాగ్యం కోసం ఊపిరి ఆగిపోయినా ఉపేక్షించని ఉద్యమకారులు గౌతు లచ్చన్న అన్నారు. శ్వాస ఆగిపోయినా స్వాభిమానం వీడని స్వాతంత్ర్య సమర వీరులన్నారు. రైతు బాంధవులు, రైతుల కోసం ఇచ్ఛాపురం నుంచి మద్రాస్ వరకు పాదయాత్ర చేసిన ఏకైక గాయకులు లచ్చన్న అని కొనియాడారు. విజయం కోసం పయనంలో వినూత్న ఒరవడికై విశృంఖల విజృంభణ చేసిన వజ్ర సదృశ స్వభావులు లచ్చన్న అని కొనియాడారు. ప్రాణార్పణలో స్వార్థ ప్రయోజనాలను స్వాగతించని స్వాతి ముత్యాలు. ధీన జనోద్ధరణే లక్ష్యం, ధ్యేయంగా తమ దీక్షా దక్షతలకు మోక్షం కల్పించే ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, ప్రజా సేవలో నిజాయితీ నావలో అజరామరం అయిన కీర్తిని ఆర్జించి, ఆంగ్లేయుల ఆగడాలపై అకుంఠిత ధైర్య సాహసాలతో పోరు ప్రదర్శించిన ధీశాలి లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రయ్య, ముదుముంచి నవీన్ కుమార్, దొంకురు తిరుపతి, డి మార్కండేయులు,ప్రకాష్ పానీగ్రాహి, గువ్వాడ లక్ష్మీ నారాయణ, బైరిశెట్టి గున్నయ్య, భావన ఢిల్లీశ్వరరావు,కుప్పిలి వెంకటరావు, మామిడి తాతారావు మరియు అభిమానులు పాల్గొన్నారు.



## గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

(సత్యంన్యూస్, టెక్కలి)



బడుగు, బలహీన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులు సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాక భారత రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన వ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని పేర్కొన్నారు. లచ్చన్న వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘననివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బలహీన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రగతి, సంక్షేమం కోసం లచ్చన్న చేసిన ఉద్యమాలు చిరస్మరణీయమన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఎనలేని కృషిచేసిన ఆయనను నేటితరం నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



ఆమదాలవలసలో నిత్యాన్నదాన ప్రసాద వితరణలో భాగంగా 445వ రోజున మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌నగర్‌కు చెందిన నెల్లూరు సూర్యప్రసాదరావు, సూర్యకుమారి దంపతులు 35 మందికి అన్నసమర్పణ చేశారు. – సత్యంన్యూస్, ఆమదాలవలస

## పాఠశాలకు మైక్ సెట్, టెంట్స్ వితరణ

(సత్యంన్యూస్, పలాస)

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గన్నవరపు గోవిందరావు తన తల్లిదండ్రులైన గన్నవరపు మల్లేసు, తవిటమ్మల జ్ఞాపకార్ధం ఖరీదైన రెండు టెంట్స్(షామియానా)లను బహుకరించారు. బోరుభద్ర ఉన్నత పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థాయిలలో స్థిరపడిన శ్రీకృష్ణాపురంకి చెందిన పూర్వ విద్యార్థులు అత్యాధునిక సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలకు బహుకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, గ్రామ పెద్దలు ఆరంగి రామారావు, అప్పిని వెంకటేష్, వసంత రావు, బాడాన శ్రీనివాసరావు, బాడాన ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రాచీన వారసత్వ సంపదలను కాపాడుకుందాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రాచీన వారసత్వ సంపదలను కాపాడుకుందామని, శ్రీకాకుళం ఇంటాక్ విభాగం కన్వీనర్, నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్, వావిలపల్లి జగన్నాథ నాయుడు శనివారం అన్నారు. గార మండలం, నిజామాబాద్ గ్రామంలో సుమారు 400 ఏళ్ల క్రితం నాటి మెట్ల బావిని శ్రీకాకుళం ఇంటెక్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఇంటాక్ బృందం మాట్లాడుతూ షేర్ మహమ్మద్‌ఖాన్ పాలనా కాలంలో గార మండలం, నిజామాబాద్ గ్రామంలో ఒక పెద్ద మెట్ల బావిని మహమ్మద్ ఖాన్ నిర్మించారన్నారు. అప్పట్లో నిర్మించిన భవనం ఈ రోజుకి కూడా నిలిచి ఉండటం గొప్ప విషయమన్నారు. ఈ ప్రదేశాన్ని ఒక పర్యాటక కేంద్రంగా మలచడానికి అవకాశం ఉందని, ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ఇంటాక్ హెరిటేజ్‌వాక్ నిర్వహించిందన్నారు. ఈ మేరకు శుక్రవారం నాడు సందర్శన స్థలానికి విచ్చేసిన గ్రామస్తులతో ఇంటాక్ బృందం మాట్లాడామన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గత 25 ఏళ్ల క్రితం వరకు ఈ మెట్ల బావి నీటిని గ్రామస్తులు త్రాగునీరుగా వినియోగించినట్లు తెలిపారన్నారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు పొన్నాడ రవికుమార్, కొమ్ము రమణమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.




'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221



పొన్నాడ గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశంలో ప్రకారం స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కార్మికులు ఆశా కార్యకర్తలు స్పందన వాలంటరీ ఆర్గనైజేషన్ వారు గ్రామ పెద్దలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పట్టణ రెండో డివిజన్ వరం కాలనీ పార్క్‌లో డివిజన్ ఇన్‌చార్జి అకెన రాజారావు ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు పాల్గొని మాట్లాడారు. ప్రతీ నెలా మూడో శనివారం అందరూ స్వచ్ఛ దివస్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరించి వాటిని ప్రత్యేక డిస్పోజల్‌కు పంపారు. కార్యక్రమంలో రెడ్డి శివన్నారాయణ, సచివాలయ అడ్మిన్ స్వరూప్, చిరంజీవి, స్వాతి, రాధ, సంతుశ్రీ తదితరులు పాల్గొన్నారు.





స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బలగ సమీపంలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేయని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించి పారవేశారు. కంపోస్ట్ గుంట ఏర్పాటు, పాఠశాల పరిసరాలు పరిశుభ్రత, మొక్కలు నాటడం, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దేవళ్ల శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.




స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పలు వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. స్వయంగా రోడ్ల వెంబడి ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను మున్సిపల్ సిబ్బందితో కలిసి ఏరివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ టి.గీత, మున్సిపల్ సిబ్బంది నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు పొట్నూరు శృతిక, D/o సుధాకర్, డీసీసీబీ కాలనీ, డోర్ నెంబరు 5-1-3/6, షిరిడీసాయిబాబా కోవెల దరి. నేను శ్రీకాకుళం బస్టాండ్ నుండి మా ఇంటికి, అనగా డీసీసీబీ కాలనీ వెళ్తున్న మార్గమధ్యలో నాయొక్క పాస్‌పోర్ట్ (No: S7081020) పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.

**830 999 2367**




- అంతర్జాతీయ పర్యాటక హబ్‌గా అభివృద్ధి
- సముద్రంలోకి ఆలివ్ రిడ్లీ తాబేళ్లు
- మత్స్యకారులకు తాబేళ్ల పరిరక్షణపై శిక్షణ
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



# బారువ బీచ్‌ను మినీ గోవాగా తీర్చిదిద్దుతాం

**(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)**
సోంపేట మండలంలోని బారువ బీచ్‌ను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శనివారం ఉదయం బీచ్ ఫెస్టివల్ సందర్భంగా ఆలివ్ రిడ్లీ తాబేళ్లను సముద్రంలోకి విడిచిపెట్టే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బారువా బీచ్‌కు ఉన్న స్వచ్ఛమైన పరిసరాలు, మహేంద్రతనయ కలిసే ప్రదేశం (బ్యాక్‌వాటర్), లైట్ హౌస్, సముద్రంలో మునిగిన ఓడ, చదునుగా విశాలంగా ఉన్న తీరం వంటి సహజ వనరులతో దీనిని మినీ గోవా తరహాలో అభివృద్ధి చేయవచ్చన్నారు. సముద్రపు లోతు, తీరప్రాంతం సరళత పర్యాటక క్రీడలకు అనువుగా ఉన్నాయని, స్కూబా డైవింగ్, పారా మోటార్ ఫ్లయింగ్, వాటర్ స్పోర్ట్స్ వంటి కార్యక్రమాలకు ఇది గొప్ప కేంద్రంగా మారుతుందన్నారు. మత్స్యకారులకు తాబేళ్ల పరిరక్షణపై శిక్షణ ఇచ్చి, ప్రకృతి సమతుల్యత కాపాడే విధంగా వారిని భాగస్వాముల్ని చేస్తున్నామని వివరించారు. ప్రజలు కోరినట్లుగా సముద్రతీర ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. పర్యాటకాభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్కూబా డైవింగ్, లైఫ్ గార్డ్, గైడ్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో వారికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి చెప్పారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షత వహించి ప్రసంగించారు. పర్యాటక అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమపాళ్లలో సాగాల్సిన అవసరం ఉందని, బీచ్ ఉత్సవం ద్వారా ఈ అంశాలపై ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని పేర్కొన్నారు. బీచ్ ఉత్సవాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ వేడుకల్లో తీరప్రాంత పరిశుభ్రత, వ్యర్థాల వేరు చేయడం, ఈ-వ్యర్థాల నిర్వహణ, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పర్యటన కార్యక్రమానికి ఇది రాష్ట్రస్థాయిలో ప్రారంభ కార్యక్రమంగా నిలుస్తోంది. భారత నౌకాదళానికి చెందిన బలరాం మాట్లాడుతూ బారువా సముద్ర తీరంలో మునిగిపోయిన 75 మీటర్ల పొడవైన ఓ నౌక చుట్టూ అద్భుతమైన సముద్ర జీవరాశి ఉందని, ఇటువంటి ప్రాంతాలు స్కూబా డైవింగ్ అభిమానికి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయని తెలిపారు. కెప్టెన్ సూర్య మాట్లాడుతూ బారువా వాతావరణం వాయు, జల క్రీడలకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 50 శాతం ఆలివ్ రిడ్లే పిల్లలే తిరిగి సముద్రంలోకి ప్రవేశిస్తాయని, అందుకే జిల్లాలో 16 కేంద్రాల ద్వారా వాటి సంరక్షణకు అటవీ శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రెండు లక్షల తాబేళ్ల పిల్లల సంరక్షణ లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తాబేళ్ల పరిరక్షణలో జిల్లా దేశంలోనే విశిష్ట గుర్తింపు సాధించిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. తాబేళ్ల పునరుత్పత్తి కేంద్రంగా శ్రీకాకుళం నిలుస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనల్లో వర్మీ కంపోస్టు, వ్యర్థాలను విద్యుత్‌గా మారుస్తున్న ప్రాజెక్టులు, ఆలివ్ రిడ్లీ తాబేళ్లపై పోస్టర్లు, చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలుగా సింహాద్రి హాసిని (జెడ్పీహెచ్‌ఎస్ బురగం), రెంటికోట విద్యార్థులు ఎంపికయ్యారు. పర్యావరణంపై అవగాహన పెంచేందుకు విద్యార్థులకు 'జీవవైవిధ్యం' అంశంపై డాక్యుమెంటరీ ప్రదర్శనలు, పర్యటనలు కూడా చేపట్టారు. బారువ బీచ్ ప్రత్యేకతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటేందుకు ప్రత్యేక వెబ్‌సైట్, ప్రచార కార్యక్రమాలు ప్రారంభించినట్టు కలెక్టర్ తెలిపారు. బారువా పేరును బ్రాండ్‌గా మార్చే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రెవెన్యూ అధికారి కృష్ణ మూర్తి, వెంకటేష్, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, పర్యాటకులు తదితరులు పాల్గొన్నారు.













# అందరికీ వేట నిషేధ భృతి

- చంద్రబాబు, అచ్చెన్నలకు కృతజ్ఞతలు

**(సత్యంన్యూస్, గార)**
సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే జీవన భృతిని రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలకు పెంచడం పట్ల జిల్లా మత్స్యకార సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మైలపిల్లి నర్సింగరావుతోపాటు గణగళ్లపేట పంచాయతీ నరసన్నపేట గ్రామ మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులకు రాసిన లేఖలో కృతజ్ఞతలు తెలిపారు. సముద్రంలో చేపల పునరుత్పత్తి, సంతాన వృద్ధి సీజను అయినందున ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు రెండు నెలలపాటు చేపల వేటను ప్రభుత్వం నిషేధించింది. 194 కి.మీ. సుదీర్ఘ తీరప్రాంతంతో 104 గ్రామాల మత్స్యకారులు చేపల వేటే ఆధారమని, వారందరికి ఈ రెండు నెలలు ప్రభుత్వం ఇచ్చే భృతే ఆధారమని పేర్కొన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు భృతి ఇవ్వడాన్ని 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం అమలుచేసిందన్నారు. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వేట నిషేధ భృతిని రూ.పది వేలకు పెంచిందని, అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దీన్ని రూ.20వేలకు పెంచడం హర్షణీయమన్నారు. భృతి పెంచడమే కాకుండా వేట నిషేధం అమల్లోకి వచ్చిన రెండు మూడు రోజుల వ్యవధిలోనే మత్స్యకారులందరికీ భృతి చెల్లించడం విశేషమని, అదే వైకాపా హయాంలో కొందరికి ఇచ్చి, ఇంకొందరికి ఇవ్వలేదని పేర్కొన్నారు. అటువంటి తేడాలు పాటించకుండా అందరికీ వేట నిషేధ భృతి ఇవ్వడం పట్ల ఆ లేఖలో కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రంథాలయంలో స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ



**(సత్యంన్యూస్, లావేరు)**
లావేరు శాఖా గ్రంథాలయంలో మూడో శనివారం గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పాఠకులు, విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోనూ, గ్రంథాలయ ఆవరణ పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.






# 27న విజయవాడలో గ్రంథాలయ పునర్వికాస సదస్సు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**
రాష్ట్రస్థాయి గ్రంథాలయ పునర్వికాస సదస్సు ఈ నెల 27న విజయవాడలో జరుగుతుందని అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఉద్యమ కమిటీ జిల్లా కన్వీనర్ బుడుమూరు సూర్యారావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీత డాక్టర్ పెనుగొండ లక్ష్మీ నారాయణ హాజరవుతారని, ఉద్యమ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహిస్తారని వివరించారు. ప్రముఖ కవులు, కవయిత్రులు, కళాకారులు, ప్రచురణ సంస్థల ప్రతినిధులు సదస్సులో పాల్గొని, వివిధ అంశాలపై చర్చిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ వ్యవస్థను పటిష్టపరచడానికి సూచనలు చేస్తారని వారు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే,1916లో ఆంధ్ర గ్రంథాలయ సంఘం విజయవాడలో ఏర్పాటయిందని, ప్రభుత్వ చట్ట ప్రకారం ప్రజలు గ్రంథాలయ సెస్ చెల్లిస్తున్నారని, కానీ, ప్రభుత్వాలు ఆ నిధులను వేరే అవసరాలకు మళ్లించడం వల్ల గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1986 నుంచి ఈ దుస్థితి ప్రారంభమైందని గుర్తు చేస్తూ, సమాజ పురోగమనంలో, స్వాతంత్ర్య ఉద్యమంలో అక్షరాస్యత, విద్యావంతుల చైతన్యం, గ్రంథాలయాల పాత్రను విస్మరించడం సరికాదన్నారు. వందేళ్ల తర్వాత మన రాష్ట్రంలో గ్రంథాలయాల పునర్వికాసం కోసం మరో ఉద్యమం చేపట్టక తప్పని పరిస్థితి రావడం వేదన కలిగిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం తప్ప ఈ ఉద్యమానికి మరో ఉద్దేశం లేదని వారు స్పష్టం చేశారు. ఇది ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమం కాదని, రాజకీయాలకు అతీతంగా విజ్ఞానాన్ని అభిమానించే, ఆశించే వ్యక్తులు, సంస్థలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ ఉద్యమం పట్ల ఆసక్తి ఉన్నవారు విజయవాడ సదస్సుకు హాజరైతే, భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

# కోమట్లు... ఎన్నికల కుంపట్లు

(మొదటిపేజీ తరువాయి)
మండపంలో నగరానికి చెందిన దాదాపు 100 మంది కళింగవైశ్య ప్రముఖులు సమావేశమయ్యారు. ఇందులో 87 మంది కోరాడ హరిగోపాల్‌కే జిల్లా బాధ్యతలు అప్పగించాలని తీర్మానించారు. వాడిగా, వేడిగా రాత్రి 11 గంటల వరకు అయిన ఈ సమావేశంలో హరిగోపాల్‌కు అనుకూలంగా, ప్రతికూలంగా పెద్ద ఎత్తున వాదనలు వినిపించాయి. ఏది ఏమైనా చంద్రబాబునాయుడు అరెస్టయినప్పుడు ఒక కులం తరఫున నిరాహార దీక్షకు కూర్చున్నది హరిగోపాల్ మాత్రమేనని, 2014 నుంచి పార్టీ కోసం పని చేస్తున్న వ్యక్తిని కాదని వలస నాయకులకు ఈ పదవి ఇవ్వడానికి లేదని తీర్మానించారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చినప్పుడు స్వయంగా ధర్మాన ప్రసాదరావే కళింగవైశ్య కల్యాణ మండపానికి వచ్చి కోరాడ హరిగోపాల్ మార్కెట్‌కు, కులానికి నాయకత్వం వహిస్తే ఎబ్బెట్టుగా ఉంటుందని, ఎందుకంటే.. తాను మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనుకుంటున్నానని, అటువంటప్పుడు పక్క పార్టీలో ఉన్న హరిగోపాల్‌ను ప్రోత్సహిస్తూ పనులు చేయడం కష్టమవుతుందని ప్రకటించారని, అందులో భాగంగానే రాష్ట్ర సంఘానికి కోణార్క్ శ్రీనును, జిల్లా సంఘానికి తంగుడు జోగారావును, నగర సంఘానికి ఊణ్ణ నాగరాజును నియమించుకున్నారని కొందరు గుర్తుచేశారు. ఇప్పుడు పార్టీ నేతలే వచ్చి కోరాడ హరిగోపాల్ పేరు ప్రకటించాల్సిన చోట భిన్నాభిప్రాయాలు సరికాదని చైతన్యప్రభు తీవ్రస్థాయిలో వ్యతిరేకుల మీద విరుచుకుపడ్డారు. అలాగే వరం తనయులు అంధవరపు సంతోష్, ప్రసాద్‌లతో పాటు చాలామంది హరిగోపాల్‌కే మద్దతు ప్రకటించారు. ఈ నెల 20న జిల్లా వ్యాప్తంగా కళింగకోమట్ల సమావేశం నిర్వహించి హరిగోపాల్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించాలని, లేదూ అంటే ఎన్నికలు రచ్చరంబోలా అయిపోతుందనే వార్నింగ్‌లు కూడా ఇచ్చారు. హరిగోపాల్‌కు జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వడం ఇష్టం లేదన్న విషయం తెలుసుకున్న కళింగకోమట్లు నగరానికే ఈ పదవి ఉండాలన్న మెలిక పెట్టారు. నగరంలో హరిగోపాల్ తప్ప మరొకరు పోటీలో లేకుండా తీర్మానించారు. గతంలో వైకాపా నియమించిన పెద్దమార్కెట్ కమిటీలో ఉన్నవారు సైతం ఈసారి హరిగోపాల్‌కే మద్దతు తెలపడం కొసమెరుపు.

# పారిశుధ్యంపై అవగాహన అవసరం

- శాంతమ్మనగర్‌లో కమిషనర్ పర్యటన
- పార్కులో పారిశుధ్య పనులు
- గొంటివీధిలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)**
పారిశుధ్యంపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని నగర కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు అన్నారు. శనివారం స్థానిక శాంతమ్మ నగర్ కాలనీలో పర్యటించారు. కాలనీలోని పార్కును పరిశీలించి పిచ్చిమొక్కలను కార్మికులతో కలిసి తొలగించారు. వాటిని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గొంటివీధిలోని సచివాలయం నుంచి స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నినాదంతో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు ప్రతి మూడవ శనివారం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన పెంపొందించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని కమిషనర్ అన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. ముఖ్యంగా తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా విడదీసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. కమిషనర్ వెంట ఎంఈ కమలాకర్. ఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, ఏఈ సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

# నెగ్గిన అవిశ్వాస తీర్మానం..

## జీవీఎంసీ మేయర్ పీఠం కూటమిదే

**(సత్యంన్యూస్, విశాఖపట్నం)**
మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై 'కూటమి' ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. ఈ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ఇన్‌ఛార్జ్ కమిషనర్, కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. వైకాపా కార్పొరేటర్లు ఒక్కొక్కరిగా పార్టీని వీడడంతో 'కూటమి' బలం పెరిగింది. జీవీ ఎంసీలో మొత్తం 97 మంది సభ్యులు ఉన్నారు. సమావేశానికి ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి 74 మంది కూటమి సభ్యులు హాజరయ్యారు. వీరంతా అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయగా, కౌన్సిల్ సమావేశాన్ని వైకాపా సభ్యులు బహిష్కరించారు. దీంతో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పదవిని కోల్పోయారు.

**కూటమి నేతల సంబరాలు..**
వైకాపా మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీ కార్యాలయం వద్ద కూటమి నేతలు సంబరాల్లో మునిగితేలారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి వేడుకలు చేసుకున్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.